

# గ్రీన్ కార్డ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(ప్రారంభం)*

*రచనాకాలం: 2000 సంవత్సరం*

*NEWTON LAWS OF IMMIGRATION*

*1st LAW*

A Desi will continue to stay in USA due to inertia of Green Card until and unless an external force called deportation is applied.

*2nd LAW*

The Force of Deportation = where amount of money desi earned in USA and the rate at which desi saved money.

*3rd LAW*

For each and every desi that goes back to desh for a temporary visit, a desi of opposite sex will come to USA on a permanent visit.

### 1

సుప్రభాత వేళ..

అమెరికాలో పెన్సిల్వేనియా రాష్ట్రంలో పిట్స్‌బర్గ్‌లో, వెంకటేశ్వరస్వామి దేవాలయం.

బి.యం డబ్ల్యు కారు. ఆ ఆలయం పార్కింగ్ స్పేస్‌లో ఆగింది. అందులోంచి దిగిన గోపీనాథ్ నేలమీద పరిచిన మార్బుల్ స్టోన్స్‌మీద నడిచి షూస్ ఓచోట వదిలి అక్కడే ఉన్న వెండింగ్ యంత్రంలోకి ఏభై డాలర్ల నోటుని ఉంచి ఓ మీట నొక్కాడు. ఆ యంత్రం ఆ డబ్బును పీల్చుకుంది. ఓ రసీదు ప్రింటై చిల్లరతోబాటు బయటకి వచ్చింది. దాన్ని తీసుకుని ఆలయంలోకి ప్రవేశించాడతను.

"యస్ సార్?" అడిగాడు పూజారి.

ఆ కాగితాన్ని పూజారికందించాడతను.

"సో, యూ నీడ్ టు డూ అర్చన?" అడిగాడు పూజారి.

"యస్ ప్లీజ్"

"అకేషన్ ఏమిటి?" అడిగాడు పుజారి, రసీదు చూసి.

"నాకు గ్రీన్ కార్డు వచ్చింది."

"ఓ కంగ్రాచ్యులేషన్స్ సర్. గాడ్‌బ్లెస్ యూ."

"ప్రదక్షిణం చేసి వస్తాను."

ఏ గుళ్ళో అయినా ఎడమ నుంచి కుడివైపు ప్రదక్షిణం చేస్తారు. కానీ గోపీనాథ్ అందుకు వ్యతిరేకంగా తిరిగాడు. ఎందుకంటే, అది అమెరికా, అక్కడ అన్నీ కుడినుంచి ఎడమకి ప్రయాణం చేస్తాయి.

మూడు బదులు ఒక్క ప్రదక్షిణమే చేశాడు గోపీనాథ్. అమెరికాలో సమయం డబ్బుతో సమానం కాబట్టి చాలాకాలంగా భక్తులంతా ఒక్క ప్రదక్షిణంతోనే సరిపుచ్చుకుంటున్నారు. కంప్యూటర్‌లోంచి సేవ టిక్కెట్ చదివి అడిగాడు పూజారి.

"పాలాభిషేకం చేయిస్తున్నారా?"

"అవును."

"నాలుగు రకాల పాలాభిషేకాలున్నాయి సార్.. నార్మల్ మిల్క్, స్కిమ్ మిల్క్, ఫేట్ ఫ్రీ మిల్క్, టు పర్సెంట్ మిల్క్. ఇందులో ఏది మీ ప్రిఫరెన్స్?"

"ఫేట్ ఫ్రీ మిల్క్..."

"వెరీగుడ్ సార్."

ఇద్దరూ గర్భగుడిలోకి దారి తీశారు. రెలిజియస్ వీసా మీద గుడ్లవల్లేరు నుంచీ వచ్చిన ఆ పూజారి తన లాప్‌టాప్‌ని అందుకుని దాని బటన్స్ నొక్కి మిల్క్ షేక్ అభిషేక్ ఫైల్‌లోకి వెళ్ళి, అందులోని ఆడియోని ఆన్ చేశాడు. అందులోంచి సంస్కృత మంత్రాలు బయటకి వినపడసాగాయి. రెండు చేతులు జోడించి భక్తిగా దేవుడికి నమస్కరించి నిలబడ్డాడు గోపీనాథ్. గోత్రం దగ్గర మంత్రం ఆడియో ఆగింది. పూజారి అతనివంక తిరిగి అడిగాడు.

"మీ సోషల్ సెక్యూరిటీ నెంబర్ ఎంత సార్?"

అతనది చెప్తే గోత్రం బదులు ఆ నెంబర్‌ని చెప్పాడు. ఒకరి గోత్రంలో, అదే పేరుతో మరికొందరు ఉండే అవకాశం ఉందేమోకానీ ఒక సోషల్ సెక్యూరిటీ నెంబర్‌తో అమెరికాలో ఉండేది ఖచ్చితంగా ఒకే ఒక్కరు. ఆ నెంబర్‌లోనే అతను మగా, ఆడా, ఇంటి చిరునామా, పుట్టిన తేదీ, ఫోన్ నెంబర్, పెళ్ళయిందా లేదా లాంటి ఎంతో ముఖ్య సమాచారం నమోదై ఉంటుంది.

ఇయర్ ఫోన్స్‌ని భక్తుడి చెవులకి తగిలించి వాక్‌మేన్ ఆన్ చేశాడు పూజారి, పాలాభిషేకం అయ్యాక, డెయిసీ పూలతో పూజ చేశాడు పూజారి. అయితే హారతి ఇచ్చే సందర్భంలో కర్పూరం వెలిగించలేదు, ఫైర్ హజార్డ్ వల్ల ఆలయంలో ఏర్పాటు చేసిన స్మోక్ డిటెక్టర్స్ ఏక్టివేట్ అయ్యే ప్రమాదం ఉంది కాబట్టి. చాలాకాలంగా హారతి బదులు టార్చ్ లైట్‌ని వెలిగించి ఆ వెలుతురుని దేవుడికి చూపించడం అక్కడ అలవాటు. ఆ సమయంలో గంట మోగించాలి. కానీ, వాయిస్ పొల్యూషన్ అరికట్టేందుకు వీలుగా హెడ్‌ఫోన్స్ తగిలించుకున్న వాక్‌మేన్‌లోంచి గంటల చప్పుడు గోపీనాథ్ విన్నాడు.

వెలుగుతున్న టార్చిలైట్‌తో గోపీనాథ్ దగ్గరకి వచ్చాడు పూజారి. ఆ లైటు కాంతిని భక్తితో రెండు చేతులతో కళ్ళకద్దుకున్నాడు గోపీనాథ్ తర్వాత ఓ పళ్ళెంలో ఉంచిన స్కానర్‌తో వచ్చాడు పూజారి. పూజారి దక్షిణ పళ్ళెంలో వేసే ఆచారం ఇండియాలో ఇంకా ఉంది. కానీ ప్రతిదీ కంప్యూటర్‌తో నడిచే అమెరికాలో ఇప్పుడా పద్ధతి పోయింది. గోపీనాథ్ జేబులోంచి తన క్రెడిట్ కార్డ్ ఫోల్డర్‌ని తెరిచి అందులోంచి ఓ కార్డ్‌ని ఎన్నిక చేసి తీసుకుని ఆ స్కానర్‌లో తన కార్డ్‌ని ఉంచి లాగాడు. దాంతో స్టాండర్డ్‌గా అయిదు డాలర్లు అతని క్రెడిట్ కార్డ్‌లోంచి డిడక్ట్ అయి ఆ పూజారి పర్సనల్ అకౌంట్‌లో క్రెడిట్ అయ్యాయి.

"థాంక్స్ సార్" అని మరోసారి ఆ క్రెడిట్ కార్డ్ ఉపయోగిస్తాడేమోనని ఎదురుచూశాడు పూజారి. అయితే గోపీనాథ్ ఆ ప్రయత్నం చేయడని గ్రహించి వెనక్కి వెళ్ళాడు.

దేవుడిని పూజించిన పూలని గ్లవ్స్ తొడుక్కున్న చేత్తో ఏరాడు పూజారి. ఓసారి ఉపయోగించిన పువ్వులని మళ్ళీ పూజ చేయడానికి పళ్ళెంలో ఉంచాడాయన.

వాతావరణ కాలుష్యం నివారించడానికి ప్రతిదీ రీసైకిల్ చేసే సంస్కృతిగల అమెరికాలో పువ్వులను కూడా రీసైకిల్ చేయడం పరిపాటి.

ఆలయంలోని ఓ బరువుతూచే యంత్రంలాంటి దానిమీద "కీప్ యువర్ ఫోర్ హెడ్ హియర్" అని రాసినచోట తన నుదుటి నుంచి క్వార్టర్ బిళ్ళ వేశాడు గోపీనాథ్. వెంటనే అందులోంచి ఓ ప్లాస్టిక్ చూపుడు వేలు బయటకి వచ్చి గోపీనాథ్ నుదుట కుంకుమని అద్దింది. తర్వాత 'థాంక్ యూ ఫర్ యూజింగ్ క్రియేటివ్ సాఫ్ట్‌వేర్' అన్న మాటలు ఆ యంత్రంలోంచి వినపడ్డాయి.

బయటకి వచ్చాక అక్కడున్న స్టాల్స్ దగ్గరకి వెళ్ళాడు గోపీనాథ్.

లార్డ్ వెంకటేశ్వర ఫోటో ఫ్రేములు ఒకప్పుడు అమ్మేవారు ఆ స్టాల్‌లో, అయితే ఇప్పుడక్కడ వెంకటేశ్వర సాఫ్ట్ కాపీస్‌ని డాలర్ కొకటి చొప్పున అమ్ముతున్నారు. అదొకటి కొన్నాడు. ఆ ఫ్లాపిని కంప్యూటర్‌లో ఉంచి చూసుకుంటే దేవుడి బొమ్మ కనిపిస్తుంది.

తర్వాత లడ్డు స్టాల్‌లోకి వెళ్ళాడు. రెండు లడ్డూలు కావాలని అడిగాడు క్రెడిట్ కార్డ్‌నిస్తూ.

"సర్! యూ వాంట్ నార్మల్ లడ్డూ? ఆర్ డయిట్ లడ్డూ?" అడిగాడు స్టాల్ కీపర్.

"ఒక నార్మల్ అండ్ ఒన్ డయట్."

"థాంక్ యూ సర్."

ఈ రెండు రకాల లడ్లని చేత్తో ముట్టుకుంటే పాపం అన్నట్లుగా, ఓ స్టీల్ పట్టకారుతో పట్టుకుని సంచిలో ఉంచి ఇచ్చాడతను. ఒకో లడ్డుకి పదకొండు డాలర్ల చొప్పున చార్జ్ చేశాడతను. ఓ ప్రింటెడ్ బ్రోచర్‌ని కూడా ఇచ్చారు లడ్డూలతోపాటు.

ఆ బ్రోచర్‌లో ఫలానా పూజలని స్పాన్సర్ చేసిన వారి ఫోటోలని (పూజ చేయించిన వారి ఫోటోలని) ఆ టెంపుల్ వెబ్ సైట్‌లో అంగుళంన్నర ఇంటూ అయిదంగుళాల సైజులో ఆరోజంతా ఉంచుతామని ఉంది. ఆ ఏడాది జరిగే ఎన్. బి.ఎ మేచ్‌స్‌లని టెంపుల్ స్పాన్సర్ చేస్తోంది?

"పబ్లిసిటీ కోసం సార్. ఈ ఏడాది హిట్ రేట్ (గుడికి వచ్చే భక్తుల సంఖ్య) కొంత స్లగ్గిష్‌గా ఉండటంతో టెంపుల్ ప్రెసిడెంట్ (ధర్మకర్త) ఈ నిర్ణయం తీసుకున్నారు. మీకు ఇంకా ప్రశ్నలుంటే, 'గాడ్ ఎట్ ఎస్‌వి టెంపుల్ డాట్ కామ్' సైట్‌లోకి వెళ్ళండి. మొత్తం సమాచారం అందులో ఉంది."

"థాంక్ యూ" చెప్పాడు గోపీనాథ్.

"థాంక్ యూ ఫర్ యూజింగ్ పిట్స్ బర్గ్ వెంకటేశ్వర టెంపుల్. గుడ్‌బై అండ్ హేవ్ ఏ నైస్ డే" చెప్పాడా స్టాల్ కీపర్.

గోపీనాథ్‌కి చటుక్కున మెలుకువ వచ్చింది కళ్ళు తెరిచి చూస్తే ఎదురుగా కంప్యూటర్, టి.వి, ఫోన్ కనపడ్డాయి. తన ఇంట్లో నిద్రపోతూ కన్న ఆ కలకి అతనికి నవ్వొచ్చింది.

మంచం దిగి బాత్‌రూంలోకి వెళుతూ ఆ కల గురించి ఆలోచించాడు. అమెరికాలో పూర్తి హైటెక్ జీవితానికి అలవాటు పడ్డ తను ఇలాంటి హైటెక్ కల రావడంలో ఆశ్చర్యం లేదనుకున్నాడు.

అది తెల్లవారు ఝామున వచ్చిన కలకాబట్టి నిజం అవుతుందా? తనకి అమెరికన్ ప్రభుత్వం ఆశ్రయం ఇస్తుందా? తను అమెరికన్ పౌరుడవగలడా?

ఆ కల శుభసూచకం అనుకున్నాడు. కానీ కల్లో దేవుడి విగ్రహం మాత్రం కనపడలేదన్న శంక గోపీనాథ్ మనసులో ఉండిపోయింది.

అమెరికాలో అక్రమ వలసదారులు అత్యధికంగా ఉన్న రాష్ట్రం అది. కేలిఫోర్నియాలోని బర్కిలీ నగరం సబర్బ్‌లోని ఓ చిన్న అపార్ట్‌మెంట్ అది. నలుగురు కలిసి అద్దెకుంటున్న ఆ త్రీ బెడ్ రూమ్ అపార్ట్‌మెంట్‌లో ప్రస్తుతం గోపీనాథ్ ఒక్కడే ఉన్నాడు.

కంప్యూటర్ ముందు కూర్చుని ఓ ఉత్తరాన్ని టైప్‌చేస్తున్నాడు గోపీనాథ్. తన అంతదాకా టైప్ చేసింది చదువుకుని స్పెల్‌చెక్ అండర్‌లైన్ చేసిన పదాల్లోని స్పెల్లింగ్‌లను కరెక్ట్ చేయసాగాడతను.

*డియర్ విరించి,* *బర్కిలీ.*

ఇవాళ ఇక్కడ నేషనల్ హాలిడే, ఫిబ్రవరిలో ఫాదరాఫ్ ది కంట్రీగా పిలవబడే జార్జ్ వాషింగ్‌టన్ పుట్టారు. మనకి గాంధీ ఎలానో వాళ్ళకి ఈయన అలాగ. ఇతనే అమెరికా తొలి ప్రెసిడెంట్. ఓ ప్రెసిడెంట్ పుట్టిన రోజున అమెరికాలో జాతీయ హాలిడే ఇచ్చేది కేవలం వాషింగ్‌టన్‌కే. ఇతని పేర అమెరికాలో ఓ ఊరు, ఓ రాష్ట్రం, ఓ యూనివర్శిటీ ఇంక ఇలా ఎన్నో ఉన్నాయి. వాషింగ్‌టన్ మొహం కూడా వీళ్ళ కరెన్సీ నోటు మీద చోటు చేసుకుంది.

ఎలా ఉన్నావు? అమ్మెలా ఉంది, నాన్నకి నా మీద బెంగ ఇంకా తగ్గలేదా? పెద్దబావ గార్లిద్దరు నా గురించి ఏమంటున్నారు?

నా పరిస్థితి ఇక్కడ షరా మామూలే. ఎంక్వయిరీ చివరి దశకు వచ్చేసింది. ఉండటమో, ఊడటమో ఇంక కొద్ది రోజుల్లో తెలుతుంది. నా అప్లికేషన్‌ని వాళ్ళు రిజెక్ట్ చేస్తే ఇండియాకి పంపించేస్తారు. నా రూంమేట్స్ ఇద్దరికి ఈ విషయంలో భయంగానే ఉంది. కపూర్, రెడ్డి ఆర్కన్సాస్ రాష్ట్రంలోని బ్రిడ్జ్ ఫోర్డ్ అనే ఊరికి పారిపోయారు. కనీసం వారు నాకు చెప్పిన సమాచారం అది. అంతా బాగుంటే తిరిగి వస్తానని చెప్పారు. లేదా యు.యస్ జనాభాలో కరిగి మెల్ట్ అయిపోతామన్నారు. ఇందాకే కపూర్ ఫోన్ చేశాడు.

కాలింగ్ బెల్ మోగిన శబ్దం వినిపించడంతో గోపీనాథ్ అంతదాకా తను టైప్ చేసింది కంట్రోల్ ఎస్ నొక్కి సేవ్ చేశాడు. శబ్దం రాకుండా టీవీలో కనబడుతున్న చిత్రాన్ని ఓసారి చూసి లేచాడు. తన గదిలోంచి హాల్లోకి వచ్చి అపార్ట్‌మెంట్ తలుపు దగ్గరకు వెళ్ళాడు. అలవాటుగా పీప్‌హోల్ నుంచి చూశాడు. కానీ అవతల ఎవరూ కనబడకపోవడంతో అడిగాడు.

''హూ ఈజ్ ఇట్?''

''ఐ ఎన్ ఎస్. ఓపెన్ అప్.''

వెంటనే గోపీనాథ్ మొహంలోకి రక్తం వేగంగా ప్రవహించింది.

''వన్ సెకండ్''

ఈసారి తలుపు మీద దబదబా బాదుతూ అరిచారు.

''ఓపెన్ అప్.''

గోపీనాథ్ ఓసారి భీతిగా హాల్లోకి చూశాడు. తనకేమయినా సహాయం దొరుకుతుందా అన్నట్లుగా. తర్వాత తాను నిస్సహాయ స్థితిలో ఉన్నాడని గ్రహించాడు. గట్టిగా ఊపిరి తీసుకుని వదిలి తలుపు చైన్‌ను పక్కకి జరిపి తెరిచాడు.

ఎదురుగా ఇద్దరు ఐ.ఎస్.ఎస్ యూనిఫారాల్లో ఉన్నారు.

''మిస్టర్ కపూర్?'' అడిగాడు ఒకరు.

"నో - హి ఈజిన్ట్ హియర్."

"యూ ఆర్ మిష్టర్ రెడ్డి?" అడిగాడు రెండోవాడు.

"నో - హీ ఈజ్ అవుట్. అయామ్ గోపీనాధ్."

"మే ఐ స్టెప్ ఇన్?" అడిగాడు రెండోవాడు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**